# ఏది విప్లవ పంథా?

శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు



'ఈ కావ్యం బాగున్నది'

'ఈ కావ్యం బాగాలేదు' అని మనం ఒక కావ్యాన్నిగురించి చెప్పినప్పుడు మన మనస్సులో వున్న ఏవో 'కొలబద్దల'తో దాన్ని కొలిచి పై నిర్ణయాలకు వచ్చామన్న మాట: ఈ కొలబద్దలు ముఖ్యంగా మూడు రకాలుగా వున్నై. కావ్య విమర్శనలో

[I] సాహిత్య విమర్శ: కాలనిర్ణయం సమకాలికుల నిరూపణ విషయ విమర్శ ఛందో వ్యాకరణాలు యీ వర్గంలోవి

[II] గతి తార్కిక భౌతికదృక్పథం దీనినే మార్క్సిస్టు దృక్పథం అంటారు (Dialectical Materialistic Criticism) యీ కోణంనుంచి చూచినప్పుడు

కావ్య వస్తువు - కవికీ వస్తువుకూ, ఆనాటి ఆర్థిక, రాజకీయ, సామాజిక వ్యవస్థకూ వున్న సంబంధాలను గ్రహించి వాటివల్ల కవి వివృతం చేసిన విషయాలు సంఘ పురోగమనానికి ఎంతవరకు తోడ్పడగలవో, ఎంత సజీవమైన శబ్ద చిత్రణద్వారా కావ్య నిర్మాణం చేసాడో విలువ కట్టడం

[iii] మనస్తత్వ పరిశీలన : కావ్యంలో వివిధసన్నివేశాలలో(Instances) పాత్రల (Objective) లేదా కవియొక్క (Subjective) మనః పరివర్తనాలు యెట్లా వున్నాయో సిగ్మండ్ ఫ్రాయిడ్‌లాగా పరిశీలించటం (Psycho - Analytical Outlook)

అయితే యే ఆదర్శమూ లేకుండా విమర్శించటం శ్రేయస్కరం కాదు. క్రొత్త క్రొత్త కవితారీతులను చూచి ఇది భారతీయ సాంప్రదాయం కాదని నిరసించడమూ మంచిదికాదు. శ్రీ అక్కిరాజు ఉమాకాన్త విద్యాశేఖరులు 'నేటికాలపు కవిత్వం'లో కవులందరినీ తిట్టారు. Degeneration అనేపుస్తకంలో Maxnardou ఇట్లాగే 19వ శతాబ్దపుకవులందరినీ తిట్టాడు. దీనికి కారణం పారిశ్రామిక విప్లవానంతరం శరవేగంతో వచ్చిన పరివర్తనలను అర్థం చేసుకోలేక పోవటమే. అవి అర్థంకాక ఆ మార్పులను ప్రస్ఫుటంచేసే కవిత్వాన్ని వెర్రి కవిత్వం అన్నాడు.

కావ్య విమర్శనకు అలంకార శాస్త్రాలు లక్షణ గ్రంథాలు ఉపకరించవచ్చు. అవి కేవలం శిల్పాన్ని నిర్దిష్టం చేస్తాయి కావ్య వస్తువును నిర్దేశించవు. అది, అపారమైన మన జీవితానుభవాలనుంచి సేకరించుకోవాలి.

కావ్యంలోని శిల్పాన్ని, వస్తువును (Technique, Form and Content) విడమరచలేము. కావ్యం వివిధ దశలలో అవి ఒకదానితో మరొకటి సమానంగా పెంపొందుతూ వుంటై. ఈ సమానాభివృద్ధి వుంటేనే మంచికావ్యం తయారవుతుంది. కావ్యంలో చెప్పేది యేదైనా బాగా చెప్పబడి వుండటంవల్ల అది మంచిదికాదు, చెప్పిన దానికి చెప్పిన విధానానికి సమానమైన ప్రాధాన్యత ఉంటుంది.

ఇంత కావ్యం విశ్వశ్రేయస్సుకా ? రసానందం కోసమేనా అన్న ప్రశ్న వున్నది. గతితార్కిక భౌతికవాద దృష్ట్యా యీప్రశ్నకు సమాధానం చెప్పుకోవచ్చు. ఇంగ్లండులో వచ్చిన పారిశ్రామికవిప్లవానంతరం అభివృద్ధిలోకి వచ్చిన మార్క్సిస్టు భౌతిక తత్వజ్ఞానం ఒక ముఖ్యవిషయాన్ని స్పష్టం చేసింది. అది మానవుడు పరిసరాలకు బానిస అనే విశ్వాసాన్ని విచ్ఛిన్నం చేసింది. విధిన్నీ పరిసరాలను మార్చగలిగిన మహత్తరశక్తి మానవుడికి వున్నదని ధృవపరిచింది. ఈ నూతనోత్సాహం దిక్కు దిక్కులా వెల్లివిరిసింది. దీనితో ప్రపంచంలో అనేక దేశాల్లో అనేకుల జీవితాల్లో తిరుగుబాటు వచ్చింది. యీ విప్లవకారులు సాహితీ జగత్తులోనూ వున్నారు. వీరి సందేశం : కొద్దిమంది తమ చేతుల్లో పెట్టుకొని వున్న విజ్ఞానం, సిరిసంపదలు అశేష జనసముదాయానికి అందుబాటులో వుండేటట్టు చేసి సామాజిక జీవితాన్ని సుఖమయమూ, శుభకరమూ, చెయ్యాలని భూతలాన్ని 'స్వర్గంగా' మార్చాలని యీ దృక్పథం. వ్యక్తి సంఘాభి వృద్ధికీ-సంఘం వ్యక్తి అభివృద్ధికీ దోహదమయ్యేటట్లు, పరస్పరం ప్రయోజనకారిగా వుండేట్టు చేస్తుంది. ఈ ఉత్తమ దృష్టి అలవరచు కొన్నప్పుడు, 'ఆత్మానందం పరమావధి' అనేదృష్టి సంకుచితంగా అభివృద్ధి నిరోధకంగా కనిపించక పోదు ! శాసనాలకంటే బలీయమైందీ, ఉదాత్తమైందీ, ఉల్లంఘించరానిదీ కవివాక్యం. అందుచేత కవి సంఘానికి మార్గదర్శకుడు కావాలి. అందుకనే వడివడిగా ప్రజలందరినీ ముందుకు నడిపించే కవిత్వం వ్రాయాలి. సంఘాన్ని ముందుకు నడిపించడమే విప్లవ పంథా, అభ్యుదయరీతి ! యిది కావ్యవిమర్శకు గీటురాయి !